అద్దె భవనాలపై మోజు..

- నిరుపయోగంగా సెస్ భవనాలు
- వినియోగదారుల డబ్బులు వృథా
- ఉన్న భవనాలకు మరమ్మతులు మరిచి
- కొత్త భవనాలకు ప్రతిపాదనలు

వేములవాడ/వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని వేములవాడ, వేములవాడ రూరల్ సెస్ కార్యాలయాలు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో అద్దె భవనాల్లో కార్యాలయాలను కొనసాగిస్తున్నారు. ఇలా ఏళ్లు గడుస్తున్నా సెస్ కార్యాలయాలకు మరమ్మతులు చేయించాలనే ధ్యాసే లేకుండా పోయింది. నూతన భవన నిర్మాణాలు చేపట్టాలనే యోచన చేయకపోవడంతో అద్దె భవనాలకు కిరాయి చెల్లిస్తూ డబ్బులు వృథా చేస్తున్నారని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు.

నిరుపయోగంగా భవనాలు

వేములవాడ సెస్ కార్యాలయం కేవలం కరెంట్ బిల్లులు తీసుకునేందుకు మాత్రమే అంకితం చేశారు. వర్షానికి స్లాబ్ నీరు కారడంతో దాన్ని మరమ్మతులు చేయించకుండా అలాగే వదిలేసి అద్దె భవనంలోకి కార్యాలయాన్ని మార్చారు. వేములవాడ రూరల్ సెస్ కార్యాలయంపైన సిమెంట్ రేకులు పగిలి వర్షానికి నీరు వస్తోంది. దాంతో పైన రేకులు మార్చితే కార్యాలయం వినియోగంలోకి వస్తుంది. కాని మరమ్మతులు చేయించకుండా నిరుపయోగంగా వదిలేశారు. దాంతో సెస్ కార్యాలయానికి కరెంట్ బిల్, ఇతర విద్యుత్ సమస్యల మీద వచ్చిన వినియోగదారులకు సెస్ కార్యాలయాలు ఎక్కడ ఏర్పాటు చేశారో తెలియక ఇబ్బంది పడుతున్నారు.



నిరుపయోగంగా వేములవాడ రూరల్ సెస్ కార్యాలయం

అద్దె భవనాల్లో..

వేములవాడ పట్టణ సెస్ కార్యాలయాన్ని వేములవాడ మార్కండేయనగర్ కాలనీలో ఏర్పాటు చేశారు. ఆ సెస్ కార్యాలయం 2018 సెప్టెంబర్ నుంచి అద్దెకు తీసుకున్నారు. నెలకు అద్దె రూ.10 వేల చొప్పున ఇప్పటికీ రూ.మూడు లక్షలకు పైగా అద్దె చెల్లించారు. ఆ కార్యాలయ భవనం రెండో అంతస్తులో ఉండడంతో వచ్చిన వినియోగదారులు భవనంపైకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు.

➡ వేములవాడ రూరల్ సెస్ కార్యాలయం వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ ఏరియాలో ఏర్పాటు చేశారు. ఆ భవనం 2018 సెప్టెంబర్ నుంచి అద్దె నెలకు రూ.10 వేలు చెల్లిస్తున్నారు. ఆ భవనం కూడా రెండో అంతస్తులో ఏర్పాటు చేశారు. ఆ భవనంపైకి వెళ్లేందుకు వినియోగదారులు ఇబ్బందిపడుతున్నారు. ఏళ్ల నుంచి సెస్ కార్యాలయాలకు అద్దె చెల్లిస్తున్నారని, ఇప్పటికైనా సెస్ అధికారులు ఆ భవనాలకు మరమ్మతులు చేయించాలని, లేదా నూతన భవనాలు నిర్మించాలని కోరుతున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న అందమైన భవనం సెస్ కార్యాలయ సొంత భవనం. అయితే చిన్నపాటి మరమ్మతుల పేరిట అధికారులు దీన్ని ఖాళీ చేశారు. దీన్ని కూల్చివేసి కొత్త భవనం నిర్మించాలని రెండేళ్ల క్రితం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. వినియోగదారులకు పూర్తిగా అందుబాటులో ఉన్న ఈ కార్యాలయాన్ని ఖాళీ చేసి అద్దె భవనంలోకి మార్చారు. కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి రిపేర్లు చేయాల్సింది పోయి ఆ భవనాన్ని ఎందుకు ఖాళీ చేశారని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

మరమ్మతు చేయించాలి



వేములవాడ సెస్ కార్యాలయాలను మరమ్మతులు చేసి ఆ భవనాల్లోనే కొనసాగించాలి. ఆ భవనాలను నిరుపయోగంగా ఉంచి, ఏళ్ల కొద్ది అద్దె భవనాల్లో కొనసాగించడం సరికాదు.
– ఎం. శ్రీనివాస్, వేములవాడ

డబ్బులు వృథా



వేములవాడ సెస్ కార్యాలయాలను అద్దె భవనాల్లో ఏర్పాటు చేయడం వల్ల వినియోగదారుల సొమ్ము వృథా అవుతోంది, అధికారులు వాటిని మరమ్మతుల చేయాలి, లేక నూతన భవనాలు నిర్మించాలి.
– వంకాయల భూమయ్య,రుద్రవరం

అనవసరంగా మార్చారు



సెస్ కార్యాలయ భవనం భవనాన్ని కూల్చి వేసి కొత్తది నిర్మిస్తామని ప్రతిపాదించడం సరికాదు. నిధులను వృథా చేయడమే. నూతన పాలకమండలి దీనిపై దృష్టి పెట్టి ఈ భవనానికి మరమ్మతు చేయించి అందుబాటులోకి తీసుకురావాలి. – దుర్గం పర్శరాం, వినియోగదారుడు

మరో పదేళ్లు బాగానే ఉండేది



ప్రస్తుతం ఉన్న కార్యాలయం భవనం మరో పదేళ్ల వరకు బాగానే ఉంటుంది. చిన్నపాటి మరమ్మతులు చేస్తే ఇప్పుడు చెల్లిస్తున్న అద్దె డబ్బులు మిగులుతాయి. ప్రస్తుతం పైఅంతస్తులోకి మార్చారు. వృద్ధులు, వికలాంగులు ఇబ్బంది పడుతున్నారు. – సీహెచ్.వెంకట్‌యాదవ్



ముస్తాబాద్‌లో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



గంభీరావుపేటలో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెల్లుబికిన నిరసన

- ప్రధాన కూడళ్లలో ధర్నా, రాస్తారోకోలు
- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలు దహనం
- మంత్రి కేటీఆర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్

టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీకి నిరసనగా జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో ధర్నా, రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎల్లారెడ్డిపేటలో పోలీసులకు, పార్టీ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. సీబీఐ లేదా, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధ్యులైనా వారిని కఠినంగా శిక్షించాలంటూ ఆందోళన చేపట్టారు. నిరుద్యోగ యువత జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే పేపర్ లీకేజీ జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పసుల వెంకటి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, బూత శ్రీనివాస్, హమీద్, దొమ్మాట నర్సయ్య, యెల్ల బాల్‌రెడ్డి, షేక్ ఫిరోజ్‌పాషా,జెడ్పీటీసీ నాగం కుమార్, ఎంపీటీసీ పర్శరాములు, గుండెల్లి శ్రీను, మాజీ జెడ్పీటీసీ గొట్టె రుక్మిణి, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
– ఇల్లంతకుంట/వేములవాడఅర్బన్/చందుర్తి/వీర్నపల్లి/గంభీరావుపేట/ముస్తాబాద్/కోనరావుపేట

వడగండ్ల బాధిత రైతులను ఆదుకుంటాం

ముస్తాబాద్: వడగండ్ల బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. ముస్తాబాద్, పోతుగల్, గూడెం, కొండాపూర్, ఆవునూర్, రామలక్ష్మణపల్లె, నామాపూర్ గ్రామాల్లో వడగండ్ల వానలకు దెబ్బతిన్న వరి పంటలను ఆదివారం పరిశీలించి, రైతులను పరామర్శించారు. నష్టపోయిన వారికి పరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. రైతులు ధైర్యంగా ఉండాలన్నారు.జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, సర్పంచులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలో వడగండ్ల వర్షంతో దెబ్బతిన్న పంటలను ప్రజాప్రతినిధులు, నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, సింగిల్‌విండో చైర్మన్ కోడూరి భాస్కర్, బండి దేవదాస్, వైస్‌ఎంపీపీ జంగిటి అంజయ్య, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాజన్న, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగారెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు కొమ్మిటి రాజిరెడ్డి, ఏఈవో వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.



ముస్తాబాద్: పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, కోరుట్లపేట, గొల్లపల్లి, బొప్పాపూర్ గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను బీజేపీ నాయకులు ఆదివారం పరిశీలించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టంపై సర్వే చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సత్యంరెడ్డి పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



వీధుల్లో పశువుల సంచారం

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో పలు వీధుల్లో పశువులు రోడ్లపై నిత్యం సంచరిస్తుండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులెదుర్కొంటున్నారు. సిరిసిల్లలో అసలే ఇరుకైన రోడ్లు, పైగా వాహనాల రద్దీ ఉంటుంది. ఆవులు, ఎద్దులు, కుక్కలు యథేచ్ఛగా సంచరిస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా వీధుల్లో తిరిగే పశువులను కట్టడి చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

మీరు ప్రశ్నించాల్సిన అధికారి: వెల్దండి సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్
ఫోన్ నంబరు: 98499 05879

పంట నష్టంపై సర్వే

వేములవాడరూరల్/రుద్రంగి/గంభీరావుపేట/తంగళ్లపల్లి: వేములవాడ మండలంలో మండలంలోని ఫాజుల్‌నగర్, నూకలమర్రి, వట్టెంల తదితర గ్రామాల్లో వడగళ్ల వానకు నష్టపోయిన పంటలను మండల వ్యవసాయాధికారి సాయికిరణ్ ఆదివారం పరిలించారు. వివరాలను జిల్లా అధికారులకు నివేదిక ఇస్తామన్నారు. ఏఈవో సందీప్, రైతులు ఉన్నారు.

రుద్రంగి మండలంలో 220 ఎకరాలలో వరి, 6 ఎకరాల్లో నువ్వులు, 40 ఎకరాల మామిడి తోటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశారు.

గంభీరావుపేట మండలంలోని రాజేశ్వర్‌రావునగర్‌లో వర్షానికి దెబ్బతిన్న వరి పొలాలను జిల్లా వ్యవసాయాధికారి రణధీర్, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దాదాపు 300 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. తహసీల్దార్ మధుసుదన్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, ఎంపీటీసీ అంజిరెడ్డి, మండల సర్పంచుల ఫోరం కన్వీనర్ రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి, గండిలచ్చపేట, ఓబులాపూర్, అంకిరెడ్డిపల్లె, వేణుగోపాలపూర్, జిల్లెల్లతోపాటు పలు గ్రామాల్లో వరి పంట, మొక్క జొన్న మిగతా పంటల నష్టాన్ని వ్యవసాయధికారులు పరిశీలించి నష్టాన్ని నమోదు చేసుకున్నారు.



బోయినపల్లిలో పంటను పరిశీలిస్తున్న తహసీల్దార్, అధికారులు



పంట నష్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సర్పంచ్ శివజ్యోతి పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పెద్ది బాంధవి రూ.19 వేలు, నక్క పోచయ్య రూ.47 వేలు, దేవవ్వ రూ.60 వేలు, శృతి రూ.13 వేలు, దుర్గవ్వ రూ.20 వేలు, లచ్చిరెడ్డి రూ.45 వేలు, హరికృష్ణ రూ.15 వేల విలువైన చెక్కులు అందజేశారు.

బోయినపల్లి: మండలలలోని కొదురుపాక గ్రామంలో పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు ఆదివారం కొదురుపాకలో పంపిణీ చేశారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు..

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలో 11వ వార్డు రాజీవ్‌నగర్‌లో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను కౌన్సిలర్ ఒగ్గు ఉమ ఆదివారం అందజేశారు. వార్డుకి చెందిన నక్క అర్చన, మ్యాన రజని, కట్కం ప్రగతి, సిరిపురం రూపకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.

క్లుప్తంగా

హెల్ప్‌లైన్ సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రోజా

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని కేజీబీవీలో మహిళ, శిశు సంక్షేమశాఖ, సఖీ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థినులకు హెల్ప్‌లైన్ సేవలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలలపై లైంగిక వేధింపులు, పోక్సో చట్టం, టోల్ ఫ్రీ నెంబర్లు 181, 100, 1098పై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు, వేధింపులపై వివరించారు. సెల్ ఫోన్ అతిగా వాడటం ద్వారా కలిగే నష్టాలు, ఫొటోలు, మెసేజ్ వల్ల కలిగే ఇబ్బందులు తెలిపారు. అలాగే సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ రోజా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రతి పేద విద్యార్థికీ ఉచిత విద్య



మ్యాపును పరిశీలిస్తున్న ప్రణయ్ కుమార్

వీర్నపల్లి: మండల కేంద్రంలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జెడ్పీహెచ్ఎస్ బిల్డింగ్ పనులను బోయినపల్లి ప్రణయ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి గానూ తరగతి గదులను విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి పేద విద్యార్థికి ఉచిత విద్యను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దినాకర్, సెస్ డైరెక్టర్ మల్లేశం, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, ఉపసర్పంచ్ రవి పాల్గొన్నారు.

పంటలకు నష్టపరిహారం చెల్లించండి



బోయినపల్లి: మాట్లాడుతున్న నాగి శేఖర్

బోయినపల్లి: అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని యువజన కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్ డిమాండ్ చేశారు. మండలంలోని అనంతపల్లి గ్రామంలో ఆదివారం వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలు పరిశీలించారు. అలువాల ధర్మయ్య, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఐలవోని మల్లన్న కల్యాణం



ఉత్సవాల్లో పాల్గొన్న తుల ఉమ

కోనరావుపేట: మండలం నిజామాబాద్‌లోని యాదవ సంఘం ఆధ్వర్యంలో ఐలవోని మల్లన్న కల్యాణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, మాజీ జెడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, యాదవ సంఘ నాయకులు లంబ మల్లయ్య, ఎల్లయ్య, బొల్లు మహేశ్, పెరుగు మల్లయ్య, ఊరడి మధు, మానుక దేవయ్య, నర్సయ్య, చెకుట రామస్వామి పాల్గొన్నారు.

నియామకం

పద్మశాలీ సంఘం కార్యవర్గం

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీ పద్మశాలీ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అలవాల గణేశ్, గౌరవ అధ్యక్షులుగా గూడూరి రవీందర్ పంతులు, బొద్దుల శ్రీనివాస్ పంతులు, ఉపాధ్యక్షులుగా మోర సుదర్శన్, వేముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సాదుల భాస్కర్, సహాయ కార్యదర్శులుగా అంబటి అంజయ్య, ఒడ్డెపల్లి రాజు, కోశాధికారిగా చిందం నరేశ్, ప్రచార కార్యదర్శి మోర అజయ్, మంచికట్ల ప్రసాద్, సలహాదారులుగా దొంతుల సత్తయ్య, రాచమల్లు సుదర్శన్, కార్యవర్గసభ్యులుగా మేరుగు తిరుపతి, మాటేటి రాజేందర్, చిప్ప రవీందర్, బల్ల లక్ష్మీపతి, గౌరిట్యాల రాజమల్లు, వేముల కిషన్, గాజుల అశోక్, మేరుగు శేఖర్ ఎన్నికయ్యారు.

బీజేపీతోనే సుస్థిర పాలన



బైక్‌ర్యాలీలో మాట్లాడుతున్న చక్రధర్‌రెడ్డి

ముస్తాబాద్: బీజేపీతోనే రాష్ట్రంలో సుస్థిర పాలన వస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కనమేని చక్రధర్‌రెడ్డి అన్నారు. బీజేపీలో చేరిన తరువాత చక్రధర్‌రెడ్డి తొలిసారి ముస్తాబాద్‌కు వచ్చిన సందర్భంగా పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ లీకేజీలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలలో నమ్మకం కోల్పోయిందన్నారు. అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, అధికార పార్టీ నేతలు కనీసం ఆదుకునే ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. బీజేపీ బలోపేతానికి బూత్‌స్థాయి నుంచి పనిచేస్తామన్నారు. బీఆర్‌ఎస్ ఎన్నికలలో ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా చేస్తున్న కాలయాపనను అందరు గమనించాలన్నారు. మండలశాఖ అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, మెంగని మహేందర్, గిరిధర్‌రెడ్డి, గోపి, మీస శంకర్, సంజీవ్, రాంగోపాల్, శ్రీకాంత్, బాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, నరేశ్, రమేశ్‌రెడ్డి, రమేశ్, జనార్దన్, ఉపేంద్ర, బండి శ్రీకాంత్, భాను తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలతో మభ్యపెడుతున్న సీఎం



మాట్లాడుతున్న రమాకాంత్

ఇల్లంతకుంట: సీఎం కేసీఆర్ మాయమాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ మభ్యపెడుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఆవునూరి రమాకాంత్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆదివారం మాట్లాడారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. దళితబంధు, డబుల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, వంటి హామీలన్నీ తుంగలో తొక్కారన్నారు. రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి ఇచ్చిన హామీని తుంగలో తొక్కారన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, సంతోష్, శ్రీకాంత్, శ్రావణ్, ప్రసన్న, గంగాధర్, సంపత్, మహేశ్, రజికాంత్, రంజిత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోనరావుపేట: మండలం కనగర్తి మూలవాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రవాణా చేస్తున్న బొమ్మెన విష్ణు, పులి నర్సయ్యను తహసీల్దార్ నరేందర్ ముందు బైండోవర్ చేశామన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు,

టీ షర్టులు అందజేత

వేములవాడరూరల్: మండలంలోని వట్టెంల గ్రామంలో క్రికెట్ క్రీడాకారులకు బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి టీషర్టులు పంపిణీ చేశారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఎగుర్ల అనిల్, దళిత మోర్చ మండల అధ్యక్షుడు గుడిసె రమేశ్, బారాజు కిషన్‌రెడ్డి, గడ్డం రాజశేఖర్, రంగు అనిల్, ఎడ్ల కిషన్, రంగు వినోద్, చంద్రశేఖర్, వెంకటేశం పాల్గొన్నారు.